క్లుప్తంగా

గంగమ్మ విగ్రహ ప్రతిష్ట


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె కస్పాలో దాత తిరుపతి నాగార్జున ఏర్పాటు చేసిన గంగమ్మ పంచలోహ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దువ్వూరి ఆంజనేయులు సోదరులు అన్నదానం, చాందినీబండి కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్లపు విశ్వనాథరెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు నాగభూషణ్‌రెడ్డి, సూరం వెంకటసుబ్బారెడ్డి, సత్యయాదవ్, చెన్నారెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రికెట్ పోటీలు


విజేతగా నిలిచిన జట్టుతో నిర్వాహకులు

నందలూరు(రాజంపేట): రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టరు, మాజీ ఎంపీపీ భువనబోయిన లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో శనివారం చింతకాయలపల్లె గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇందులో 20 టీమ్‌లు పాల్గొన్నాయి. టంగటూరు జట్టు విజేతగా నిలిచింది. ఎంపీటీసీ భువనబోయిన శ్రీదేవిపెంచలయ్య రూ.35 వేలు, కడప శ్రీనివాసులు రూ.10 వేల విరాళం అందజేశారు. విన్నర్స్‌కు షీల్డ్, రూ.20 వేలు, రన్నర్స్‌కు షీల్డ్, రూ.15 వేలు అందించారు. కార్యక్రమంలో సర్పంచులు చుక్కా యానాది, మైనుద్దీన్, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, నాయకులు చుక్కావెంకటేశు, చుక్కా వెంకటయ్య పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

లక్కిరెడ్డిపల్లి: ఈ నెల 21, 22వ తేదీలలో జరగబోవు గంగమ్మ జాతర కోసం చేస్తున్న ఏర్పాట్లను సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ వినోద్ కుమార్ శనివారం పరిశీలించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని వారు ఆలయ కమిటీ సిబ్బందికి సూచించారు. ఇప్పటికే ప్రత్యేక క్యూలైన్లు, వాహనాలు, ఆర్టీసీ బస్సుల పార్కింగ్, చిరు వ్యాపారస్తుల స్థలాలను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామాల నరసింహారెడ్డి, ఈఓ రవీంద్రరాజు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఓబులవారిపల్లె: మండలంలోని అయ్యలరాజుపల్లె దళితవాడ గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహులు భార్య కొప్పల లక్ష్మమ్మ(60) శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, పుత్తూరు సీఐ లక్ష్మినారాయణ సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దుర్గప్రసాద్, సీసీ మణి, స్థానిక నాయకులు కొప్పల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వీరబల్లి: మండల పరిధిలోని దిగువరాచపల్లి గ్రామ పంచాయతీ కొత్త సచివాలయంలో ఆదివారం ఉదయం పాస్ పీపుల్స్ యాక్షన్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంటు చమర్తి శ్రీకాంత్‌వర్మ పేర్కొన్నారు. రాయచోటి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు ఉషోదయ హాస్పిటల్ డాక్టర్ వడ్డెమాని సుదర్శన్ (ఆర్థో), జనతా హాస్పిటల్ డాక్టర్ మడితాటి నాగిరెడ్డి (ఫ్యామిలీ ఫిజీషియన్) వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిమాన్వితుడు శ్రీ మాలె పెద్దయ్యస్వామి

– నేడు జాతర

చిన్నమండెం : మండల పరిధి దేవగుడిపల్లె పంచాయతీ కురవపల్లె సమీపంలోని చింతోళ్ల మాలెలో శ్రీ మాలె పెద్దయ్యస్వామి జాతర మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం జరగనున్నాయి. ఉదయం నుంచి ప్రారంభం కానున్న జాతరకు కోనేటిలో నీటి వసతులతోపాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహాశివరాత్రి జాగారణ సందర్భంగా శనివారం అర్ధరాత్రి నుంచి జల్లావాండ్లపల్లె నుంచి దేవరెద్దు సంప్రదాయ పద్ధతిలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ దేవగుడిపల్లెలోని దేవరింటికి చేరుకుంటుంది. దేవగుడిపల్లె కురవపల్లె మీదుగా పూజలు అందుకుంటూ చింతోళ్లమాలెకు చేరుకున్న దేవరెద్దుతో జాతర ప్రారంభమవుతుంది. బిడ్డలు లేని వారు సంతాన వరాల కోసం పెద్ద ఎత్తున వరపడతారు. అనంతరం మొక్కులు చెల్లించుకుని సాయంత్రం 4 గంటలకు బండారు కార్యక్రమం చేయనున్నారు. రాత్రి అక్కడే ఉన్న దేవరెద్దు సోమవారం ఉదయం కురవపల్లె దేవుడుపల్లె మీదుగా జల్లావాండ్లపల్లెకు చేరుకోవడంతో జాతర ముగుస్తుంది. భక్తాదులు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

శంభో శివ శంభో

- భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు
- మార్మోగిన శివనామస్మరణ


సిద్దవటం:శ్రీ నిత్యపూజస్వామి కోనలో శివ, పార్వతుల కల్యాణం


రాజంపేట : తాళ్లపాకలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


రాజంపేట రూరల్: అత్తిరాలలో స్వామి దర్శనానికి బారులు దీరిన భక్తులు

రాజంపేట రూరల్ : మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని శివాలయాలు శనివారం భక్తులతో పోటెత్తిపోయాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత శ్రీత్రేతేశ్వరస్వామిని దర్శనం చేసుకునేందుకు వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయం చేరుకున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థ సంఘాలు, సేవ సంస్థలు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అదే విధంగా భక్తులకు పెద్ద ఎత్తున మజ్జిగ ప్యాకెట్లను, మంచినీటి ప్యాకెట్లను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. శ్రీత్రేతేశ్వర స్వామి వారిని కామాక్షి మాతను వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకుడు కె. పద్మనాభశాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితుల బృందం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా శివ భక్తుడు భక్తకన్నప్ప జన్మస్థలమైన ఊటుకూరులో శ్రీనాగలింగేశ్వరస్వామి, కామాక్షిమాతలను ప్రత్యేక అలంకరణలో శోభాయమానంగా అలంకరించారు. స్వామి వారిని దర్శించు కొనేందుకు భక్తుల తాకిడి అధికమైనది. ఆలయ అర్చకుడు ఫణిస్వామి అధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ఊటుకూరులో గ్రామోత్సవం కార్యక్రమం నిర్వహించారు.

ప్రత్యేక పూజలలో జడ్పీ చైర్మన్ అమర్‌నాథరెడ్డి

జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి శివరాత్రిని పుస్కరించుకొని త్రేతేశ్వరుని దర్శనం కోసం శనివారం అత్తిరాలకు విచ్చేశారు. ఈఓ జీ కొండారెడ్డి, కమిటీ చైర్మన్ వీ వెంకటసుబ్బారెడ్డిలు ఎదొరొచ్చి ఆలయ అర్చకులతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నాగలింగేశ్వరుడు పెళ్ళికొడుకాయనే....

పదకవితాపితామహుడు అన్నమయ్య అవ్వగారి గ్రామం, మహా శివభక్తుడు భక్తకన్నప్ప జన్మస్థలమైన ఊటుకూరు గ్రామంలో వెలసిన శ్రీనాగలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం శివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకామాక్షీదేవి సమేత శ్రీనాగలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. తొలుత నాగలింగేశ్వరస్వామి, శ్రీకామాక్షీదేవి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కళ్యాణ ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. అనంతరం వేదపండితులు ఫణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చనలతో స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. స్వామివారి కళ్యాణ మహోత్సవం జరుగుతున్నంత సేపు భక్తులు శివన్నామస్మరణ చేశారు. అనంతరం రాత్రి స్వామివారికి గ్రామోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కల్యాణం, గ్రామోత్సవం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించిన దాతలు నాగా. ఫథ్వీపతిరెడ్డి, కళావతి దంపతులు, నాగా. సుధాకర్‌రెడ్డి, శ్రీలతమ్మ దంపతులు, ఎర్రిబాబు. బోగేంద్రనాథ్‌రెడ్డి, రాధమ్మ దంపతులు, మూరి. లక్ష్మికర్‌రెడ్డి, హరిత దంపతులు, ములక్కాయల. నరసారెడ్డి, శ్రీదేవి దంపతులు, ములక్కాయల. సుధాకర్‌రెడ్డి, మంజుల దంపతులతో పాటు గ్రామ పెద్దలు రేవరాజు. శ్రీనివాసరాజు, మేడా. క్రిష్ణార్జునరెడ్డి, నాదవరాజు, సుబ్బనరసరాజు, జీ వెంకటయ్య, హరి, సతీష్, జె నాగరాజు, ఆర్ సుబ్బరాజు, ఆర్. సుబ్బరామరాజు, జె. నాగరాజు, బాలతో పాటు భక్తులు, మహిళలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కల్యాణ వేడుకలలో జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా నాగలీమగేశ్వరస్వామిని. కామాక్షి మాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకనదుర్గా మహేశ్వరస్వామి దేవస్థానంలో..

మండల పరిధిలోని వెంకటరాజంపేట గ్రామంలో వెలసివున్న శ్రీకనదుర్గా మహేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రిని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అదే విధంగా కనదుర్గా సమేత మహేశ్వరస్వామిలకు ఘనంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు.

వైభవంగా సిద్దేశ్వరస్వామి కళ్యాణం

మండల పరిధిలోని వరదయ్యగారిపల్లి గ్రామంలో వెలసివున్న శ్రీ అక్కమ్మతల్లి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అదే విధంగా శ్రీఅక్కమ్మతల్లి సమేత శ్రీ సిద్దేశ్వరస్వామిలకు ఘనంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. అక్కమ్మతల్లి, సిద్దేశ్వర స్వామిలను ప్రత్యేక ఆసనంపై కొలువుతీర్చి ఆలయ అర్చకుడు తోపుగుంట రామయ్య ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు, ఆలయ కమిటీ నిర్వహకులు పాల్గొన్నారు. అదే విధంగా కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వహకులు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కొండూరు విశ్వనాథ్‌రాజు, ఆంజనేయులునాయుడు, వెంకట్రామనాయుడు, ఆర్ వెంకటేష్, చలమయ్య, నరసింహులు, వెంకటయ్య, ప్రసాద్, ఉభయ ధాత కావుటూరు సుబ్రమణ్యంనాయుడు దంపతులు, సస భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

నందలూరు (రాజంపేట): నందలూరు గ్రామంలో వెలసిన పురాతన శ్రీశ్రీశ్రీ మొండీశ్వరస్వామి ఆలయం సమీపంలో శనివారం శివ, పార్వతి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. పేటగడ్డ వాసుల నేతృత్వంలో జరిగిన కళ్యాణోత్సవంలో తుడిమెల్ల బాలసుబ్రమణ్యం తలంబ్రాలను, పసుపులేటి శంకర్, దాసరి ఆదినారాయణ ఆధ్వర్యంలో కళ్యాణం నిర్వహించనున్నారు. అలాగే పొత్తపిలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంతోపాటు, యేటివారంబడి ఉన్న గ్రామాల్లోని శివాలయాల్లో కూడా శివరాత్రి సందర్భంగా పూజలు జరిగాయి. నందలూరు రైల్వేకేంద్రంలోని రైల్వే శివాలయం(కొత్తక్వార్టర్స్)లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అన్నదానాలు జరిగాయి.

తాళ్లపాకలో..

తిరుమ తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తాళ్లపాక గ్రామంలో శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు భక్తవత్సలం ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. శ్రీ సిద్దేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించారు. ఊరేగింపు నిర్వహించారు. తాళ్లపాక సర్పంచి చామనబోయిన గౌరీశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, టీటీడీ సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

ఉల్లంఘేశ్వరాలయంలో..

చోళులకాలంలో నిర్మితమైన కామాక్షి సమేత ఉల్లంఘేశ్వరాలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయం జీర్ణోద్దరణలో కొనసాగుతోంది. అందువల్లన తాత్కలికంగా ఏర్పాటుచేసిన ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆక్వాబీడ్ అధినేత కేదర్‌నాథ్‌బాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గుండ్లూరు మాజీ సర్పంచి ముమ్మడిమదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో దాతను సత్కరించారు. సుమన్ మిత్రబృందం ఆధ్వర్యంలో ఆలయంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా సెక్రటరీ అమీర్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు అరిగెలనాని, బెస్త సంఘం నాయకులు పాల్గొన్నారు.

వీరబల్లి: మండల పరిధిలోని శివాలయాలు శనివారం శివరాత్రి సందర్భంగా శివనామస్మరణలతో మార్మోగాయి. అనంతరం శైవక్షేత్రాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్దకు విచ్చేసిన భక్తులకు దాతలు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వీరబల్లి, గడికోట, సానిపాయి, ఓదివీడు, పెద్దవీడు, వంగిమళ్ళ తదితర గ్రామాలలోని ఆలయాలలో పెద్దఎత్తున భక్తులు చేరుకొని పూజలు నిర్వహించారు.

సిద్దవటం: మండలం లోని నిత్యపూజ స్వామి కోన, సిద్దవటం గ్రామ సమీపం లోని కపర్థీశ్వరస్వామి కోన, సిద్దవటం లోని కామాక్షి సిద్దవటేశ్వర స్వామి, కనుమలోపల్లె సమీపం లోని నీలకంఠేశ్వరస్వామి , జ్యోతి గ్రామ శివారు లోని జ్యోతి సిద్దవటేశ్వర స్వామి ఆలయాల్లో మహా శివరాత్రి పర్వదినాన శనివారం వారం శివ నామ స్మరణతో మారుమ్రోగాయి. కడప ఎస్పీ అన్బురాజన్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యే పూజలు నిర్వహించారు,. ఆయనకు ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి తీర్ధ ప్రసాదాలను అందజేశారు. పంచలింగాల వద్ద భక్తులకు దాతలు అన్నదాన కార్యక్రమాలను భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. నిత్యపూజ స్వామి కోనలో, పంచలింగాల వద్ద పి. కొత్తపల్లె వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. అంతే గాకుండా దారి పొడవునా మజ్జిగ ప్యాకెట్లు, తాగు నీరు, వంటివి దాతలు భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌పి చెంచుబాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్, తహసీల్దారు శంకర్‌రావు, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ , ఆలయ చైర్మన్ పాటూరు కొండారెడ్డి, ఈఓ మోహన్‌రెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: మండల పరిధిలోని మృకుండ మళ్లేశ్వరపురం, గుంటుగాడిపల్లె, భైరవకోన, ఒంటిమిట్టలో కొలువైన పరమేశ్వరుడికి శనివారం మహాశివరాత్రి సందర్బంగా ప్రత్యేక పూజలతో ఉత్సవం శోభ నెలకొంది. శివ లింగాలకు అభిషేకాలు నిర్వహించారు. ఒంటిమిట్ట చెరువు కట్టపై ఉన్న శివాలయం వద్ద భక్తులకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మృకుండ మళ్లేశ్వరస్వామి ఆలయం వద్ద గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మృకుండ మల్లేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చంద్రశేఖర్, కోటేశ్వరశర్మ కలిసి శివపార్వతుల విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు.


రాజంపేట : నందటూరు మండలం తాళ్లపాకలో కల్యాణోత్సవంలో శివ,పార్వతులు


ఒంటిమిట్ట: గుంటుగాడిపల్లెలోని మల్లయ్యస్వామి


ఒంటిమిట్ట: భైరవ కోనలో కొలువైన పరమేశ్వరుడు


రాజంపేట రూరల్: వరదయ్యగారిపల్లెలో అక్కమ్మతల్లి


రాజంపేట రూరల్ : అత్తిరాలలో ప్రత్యేక అలంకరణలో శ్రీ కామాక్షిమాత

కమనీయం.. పార్వతీపరమేశ్వరుల కల్యాణం


సంబేపల్లె: మోటకట్ల శివాలయంలో దర్శనమిస్తున్న శివలింగం


రాయచోటి టౌన్ : ఉమామమేశ్వరస్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణం

రాయచోటిటౌన్ : రాయచోటి పట్టణ, రూరల్ పరిధిలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. పాతరాయచోటిలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో, ఎస్ఎన్ కాలనీలో చెక్ పోస్టు వద్ద ఉమామహేశ్వరీ దేవి ఆలయంలో, చెన్నముక్కపల్లె శివాలయంలో శివపార్వతుల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చెక్ పోస్టు వద్ద ఉమామహేశ్వరీ దేవి ఆలయంలో శివగంగిరెడ్డి దంపతులు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులకు మడితాటి శ్రీనివాసుల రెడ్డి అన్నదానం చేశారు. పాతరాయచోటిలో అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో, చెన్నముక్కపల్లె ఈశ్వరుడి గుడిలో స్థానికులు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన శ్రీ అఘోరలింగేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించి రంగు రంగు పూలతో అందంగా అలంకరించారు.

పురుష మృగవాహనంపై భద్రకాళీ సమేతుడు

రాయచోటి శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం శ్రీ భద్రకాళీ సమేతుడు పురుష మృగ వాహనంపై ఊరేగారు. శనివారం ఉదయం మహా శివరాత్రి సందర్భంగా రుద్రహోమం నిర్వహించారు. అనంతరం మహాశివరాత్రి అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక పల్లకీలో ఉంచి ఆలయ మాడ వీధులలో ఊరేగించారు. అనంతరం పట్టణ పురవీధులలో ఊరేగారు. మార్కెట్ వీధి, గాంధి బజారు, కంసల వీధి, బ్రాహ్మణ వీధుల గుండా ఆలయానికి చేరుకున్నారు. స్వామి వారికి అడుగడుగునా భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి మయూరా వాహనం (చదురు) పై ఊరేగారు.

దర్శించుకున్న న్యాయమూర్తులు

రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన శ్రీ అఘోరలింగేశ్వర స్వామిని న్యాయమూర్తులు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శారద, జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణ కుట్టిలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలం రెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు వీరి పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రీ వీరభద్రస్వామి, శ్రీ భద్రకాళీ అమ్మవారికి వీరు పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే వీరిని దుశ్శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు.

సంబేపల్లె : ఈ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి గాంచిన చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై వెలసిన మోటకట్ల వెంకటశివసాయి ఆలయం, మండల కేంద్రంలోని శ్రీ గుహేశ్వరీ పశుపతినాథ ఆలయాలలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం శివలింగస్వరూపులైన ఆదిదేవునికి భక్తులు భారీ స్థాయిలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాలను పచ్చని తోరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేకువ జామునే భక్తులు స్నానాలు ఆచరించి తెల్లవారు జామునుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. దీంతో శివాలయాల ప్రాంగణ మంతా శివనామస్మరణతో మారుమోగింది. ఆలయాలలోని మూలవిరాట్‌మూర్తులైన శివలింగస్వరూపులకు ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, బిల్వార్చనలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కళ్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. చిన్నజంగంపల్లెలోని మల్లిఖార్జునస్వామి ఆలయం, దుద్యాల, శెట్టిపల్లె, గున్నికుంట్ల, రౌతుకుంట, దేవపట్ల, గుట్టపల్లె, ఎస్ సోమవరం, గురిగింజకుంట తదితర గ్రామాలలో కొలువైన మహాదేవుని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిన్నమండెం : మండలంలోని పలు ఆలయాలలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించి భక్తాదులకు అన్నదానం చేశారు. అదే విధంగా జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి పడమటికోనలో వెలిసియున్న శ్రీ గెవి మల్లీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణోత్సవంలో పాల్గొని భక్తాదులకు అన్నదానం నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని శివాలయాలు శివ నామ స్మరణలతో శైవక్షేత్రాలన్నీ మార్మోగాయి. శని త్రయోదశి శివరాత్రి రావడంతో అధిక సంఖ్యలో భక్తులు శైవక్షేత్రాలకు చేరుకొని శివునికి అభిషేకాలు నిర్వహించారు. శనిత్రయోదశి కావడంతో నవగ్రహాలకు పూజలు నిర్వహించారు. చప్పిడి గుగ్గిళ్ళు ప్రసాదాలతో స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి శివాలయంలో శివనామ స్మరణలతో మార్మోగాఇంది. లక్కిరెడ్డిపల్లిలోని శివాలయంలో అర్చకులు హరినస్వామి, ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

సర్వాంతర్యామి పరమశివుడు

రామాపురం : పరమశివుడు సర్వాంతర్యామి అని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రామాపురం మండలం హసనాపురంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలలోనూ, కళ్యాణోత్సవంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు గావించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీకాంత్‌రెడ్డికి కార్యక్రమ నిర్వాహకులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికి ఆయన చేత పూజా కార్యక్రమాలు నిర్వహింపచేశారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేసి దుస్సాలువాతో శ్రీకాంత్‌రెడ్డిని సన్మానించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు పప్పిరెడ్డి మహేశ్వరరెడ్డి, చలమారెడ్డి, నాగేంద్రరెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు, గూటాల చంద్ర, వైఎస్ ఆర్ టీచర్స్ ఫెడరేషన్ నేత పాత్రెడ్డి, రామమోహన్ రెడ్డి, చీకటి చంద్ర, చిన్నసిద్దయ్య, మాజీ కోఆప్షన్ హాజీమ్, పప్పిరెడ్డి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

గాలివీడు: మండలంలోని శివాలయాలు శివనామస్మరణలతో మార్మోగాయి. నూలివీడు మల్లేశ్వరి ఆలయంలో ఎంపిపి జల్లా సుదర్శన్ రెడ్డి దంపతులు, గండిమడుదు శివాలయంలో వైస్ ఎంపిపి యదభూషన్ రెడ్డి దంపతులు, సర్పంచ్ ఉమాపతిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివాలయాల్లో విశేష పూజలు


రైల్వేకోడూరు : రామాలమ్మకోనలోని శివుడు

రైల్వేకోడూరు : మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని రామాలమ్మకోనకు భారీ ఎత్తున భక్తులు హాజరైనారు. స్టేట్ ఎక్జిక్యూటివ్‌మెంబర్ ముప్పాల హేమనవర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తూర్పుపల్లెలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 16 అడుగుల శివలింగానికి భక్తులు పూజలు నిర్వహించారు.

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని శ్రీ భుజంగేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ కమిటి చైర్మన్ పోకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం ఉపసర్పంచ్ తోట శివసాయి దంపతుల చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి హాజరైనారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సిహెచ్.రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెనగలూరు: పెనగలూరు శివాలయంలో కుండవరపు రామలింగయ్యస్వామి సతీమణి వరలక్ష్మమ్మ దంపతులు.. శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. తూర్పుపల్లి వద్ద బోడమల్లేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 5 వేల మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ గుర్రయ్య తెలిపారు. సింగనమల ఆలయంలో శివపార్వతుల కల్యాణం, అన్నదానం, కోమంతరాజుపురం నాగేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

చిట్వేలి: చిట్వేలిలోని శ్రీ శ్యామలాంబ సమేత శివాలయంలో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణ ముత్యాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు కన్నుల పండువగా కల్యాణాన్ని నిర్వహించారు. పాత చిట్వేలి భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. గుండాల కోన, మూలరోడ్డు, నక్కలపల్లి భవానీ శంకర ఆలయం, నగిరిపాడు, లక్ష్మీపురం, రాజుగుంటలలో వెలసిన శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఓబులవారిపల్లె: వైకోట గుండాల కోన ప్రాంతానికి జిల్లా నలు మూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు చేరుకొని నీలకంఠేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడి ఉన్న గుండాలలో భక్తులు పెద్ద ఎత్తున స్నానాలు ఆచరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎక్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమస్‌వర్మ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. గాదెల వెంకటాపురం గ్రామంలో శివాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైకోట సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర,కొమ్మూరు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్దఓరంపాడు సిద్దిలేశ్వర స్వామికి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ పూజారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తమ్మెద తిరుపాల్, జెడ్పీటీసీ లక్ష్మినరసయ్య, మాజీ సర్పంచ్ రవిచంద్ర పాల్గొన్నారు.

అన్నదానం

పెద్దఓరంపాడు గౌరిసిద్దిలేశ్వరుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు ముక్కా రూపానందరెడ్డి వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమన్ని నిర్వహించారు. అంతక ముందు రూపానందరెడ్డి కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. సిద్దిలేశ్వరుడికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్రా యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు ముక్కా మధుసుధన్‌రెడ్డి పాల్గొన్నారు.


ఓబులవారిపల్లె: గుండాల కోనలో ప్రత్యేక పూజలందుకుంటున్న నీలకంఠేశ్వరుడు